

# రుధిర సంగ్రామం

– పొత్తూరు రాజేంద్ర ప్రసాద్‌వర్మ



*వాస్తవంగా జరిగిన పద్మనాభ యుద్ధంలో సంఘటనలు, చారిత్రక అంశాలను క్రోడీకరించి ఆనాటి రాజకీయ సాంఘిక నేపథ్యాలను ఆధారంగా చేసుకుని సంఘటనలను అల్లుకుని రాసిన చారిత్రక నవల. వ్యక్తులు ప్రదేశాలు సన్నివేశాలను కథారూపంలో తయారు చేయడం జరిగింది. యుద్ధం జరగడం వెనుక కారణాలను వివరించడానికి కథారూపంలో విస్తరించడం వల్ల పాఠకులు సులభంగా చదువుకోవడమే కాకుండా చరిత్రలో మరుగున పడిపోతున్న క్షత్రియుల పోరాట పటిమకు, పౌరుషానికి, బ్రిటిష్‌వారి సార్వభౌమత్వాన్ని ధిక్కరించి, ఎదిరించి నిలిచి వీరోచితపోరాటం చేసినవారి స్ఫూర్తిని తెలియజేయడానికి నవలారూపంలో రాసిన చారిత్రక సంఘటనల మాలిక ఈ రుధిర సంగ్రామం.*

*పరాయిపాలకుల దాస్య శృంఖలాలను తెంచుకోవాలని ప్రాణాలొడ్డి పోరాటాలు చేసిన ఎంతోమంది వీరులు ఉత్తరాంధ్ర జిల్లాలో ఉన్నారు. బ్రిటిష్‌వారి దాష్టీకాలను ఎదుర్కోవడానికి వీరోచితమైన యుద్ధం చేసి అసువులు బాసిన ఎంతోమంది వీరాధివీరుల్లో చిన విజయరామరాజు ఒకరు. విజయనగర సంస్థానానికి చెందిన ఈయన ఉత్తరాంధ్ర జిల్లాలో సామంతరాజుల్ని కూడగట్టుకుని బ్రిటిష్ వారిపై ఆ794లో చేసిన పోరాటం స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఈ యుద్ధంలో ఎంతోమంది బ్రిటిష్‌వారు చనిపోయారు. బ్రిటిష్ సైనికులు తుపాకులతో చేసిన పోరాటానికి వీరావేశంతో వచ్చిన వీరాధివీరులైన రాజుల చేతిలో చిక్కి విగతజీవులయ్యారు. తెలుగుజాతి ఆత్మాభిమానాన్ని నిలబెట్టడానికి, తెలుగుతేజాన్ని నిరూపించడానికి, బానిసబతుకుల్ని ఎదిరించాలన్న రాజుల పౌరుషాన్ని చూపించడానికి. పరాయి పాలకుల పీడను విరగడ చేయడానికి తెలుగువారి దాస్యశృంఖలాలు తొలగించడానికి చేసిన పోరాటం పద్మనాభయుద్ధంగా చరిత్రలో నిలిచిపోయింది.*

*భారతదేశంలో ఎన్నో ప్రాంతాల్లో ఎంతోమంది వీరులు పోరాటాలు చేశారు. ఈ దేశం మాది మీరు మీ దేశం పొండని తిరుగుబాట్లకు పాల్పడ్డారు. బ్రిటిష్‌వారిని ఎదిరించి దేశభక్తులుగా నిలిచారు. ఇతర ప్రాంతాలకు చెందిన ఎంతోమంది స్వాతంత్ర సమరయోధుల వీరగాథలు చరిత్రలో నిక్షిప్తం అయ్యాయి. అయితే విజయనగర రాజులు వీరోచిత పోరాట చరిత్ర పద్మనాభ యుద్ధానికి ఉంది. ఇతర ప్రాంతాలలో జరిగిన పోరాటాలతో పోలిస్తే విభిన్నమైన ఈ యుద్ధ చరిత్ర దాని నేపథ్యం చాలావరకు అజ్ఞాతంగానే ఉండిపోయింది. విశాఖ మాన్యుయేల్‌లో లార్డు కార్మికేల్ మాత్రం ఈ యుద్ధంలో చనిపోయిన వీరుల వివరాలను నిక్షిప్తం చేశారు. ఈ పద్మనాభ యుద్ధాన్ని స్కాట్లాండులో జరిగిన లాడెన్ సంఘటనతో చరిత్రకారులు పోలుస్తుంటారు. ఆ794లో జరిగిన ఈ యుద్ధం దాని చారిత్రక నేపథ్యంతో రాసిన నవల.*

*(గతసంచికతరువాయి)*

***అన్నదమ్ముల మధ్య మళ్ళీ విబేధాలు***

సీతారామరాజు దివాన్‌గా మళ్ళీ బాధ్యతలు తీసుకున్నందున అన్నదమ్ముల మధ్య విబేధాలు మొదలయ్యాయి. పదవిలోకి రాగానే తన వ్యతిరేకులపై కక్ష సాధింపులకు పూనుకున్నాడు. మళ్ళీ దివాన్‌గా రావడంతో గతంలోకన్నా ఎంతో బలోపేతం అయినట్లు భావించాడు.

తన చర్యలను సమర్ధించడంలేదని బ్రిటిష్ కంపెనీకు దుబాసీగా ఉన్న గొడే జగ్గారావుని మద్రాసు వెళ్ళరాదని ఆంక్షలు విధించాడు. అతను మద్రాసు వెళ్ళవలసిన అవసరం ఉందని ఎంత చెప్పినా వినలేదు. బ్రిటిష్ కంపెనీకి ఈ చర్యకోసం తెప్పిస్తుందని చెప్పినప్పటికీ కోపం ఎవరికి వచ్చినా పర్వాలేదన్న ధోరణిలో వ్యవహరించాడు.

తనకన్నా ముందు దివాన్‌గా పనిచేసి ప్రస్తుతం బ్రిటిష్ సంరక్షణలో ఉన్న జంపన జగన్నాధరాజుని అతని సోదరుడు రామరాజుని బలవంతంగా విజయనగరం రప్పించి ప్రజావ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ కోటలో బంధించాడు. ఈ విషయాలు తెలుస్తున్నా విజయరామరాజు ఏమీ అనలేక మౌనంగా ఉండిపోయాడు.

తాను తీసుకుంటున్న చర్యలు బ్రిటిష్ అధికారులకు కోపం తీసుకుని వస్తాయని వారు యుద్ధం చేయడానికి కూడా సిద్ధపడతారని దివాన్ సీతారామరాజుకు తెలుసు. అన్నింటికీ సిద్ధంగా ఉండాలని విజయనగరం, అనకాపల్లి కోటలను మరమ్మత్తులు చేయించాడు. ఖజానాలో నగదు నిండుగా ఉండటానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నాడు.

పేరుకు దివాన్ అయినప్పటికీ రాజుకన్నా బలవంతుడిగా అధికారాన్ని చెలాయించే వ్యక్తిగా ఎదిగిపోయాడు. అందుకు తగిన ప్రయత్నాలను కూడా ప్రారంభించాడు. సామంతరాజులు ఎవరూ తిరుగుబాటు చేస్తారన్న భయంలేదు. గతంలో తాను చేసిన దండయాత్రలలో లభించిన అపారమైన ధనరాశులు ఉన్నాయి. ఆ సమయంలో బ్రిటిష్ కంపెనీ కళింగాంధ్రలో బలపడలేదు. ఇప్పుడిప్పుడే వేళ్ళూనుకుంటోంది. అవసరమైతే యుద్ధం చేసైనా బ్రిటిష్ కంపెనీని అదుపు చేయాలన్నది సీతారామరాజు ఎత్తుగడగా ఎంచుకున్నాడు. ఇదే విషయాన్ని తమ్ముడు విజయరామరాజుకు చెప్పి "బ్రిటిష్‌వారిపై అవసరమైతే యుద్ధం కూడా చేయవలసి ఉంటుంది అన్నాడు.

"యుద్ధమా? వారితో ఘర్షణ ఎందుకు?"

"తమకు కొన్ని విషయాలు అంతగా తెలియదు. ప్రస్తుతం వారు మనకు శత్రువులుగా ఉన్నారు. వారికి మనమే బలమైఅన్ వారమన్న భావన కలిగిస్తే మన జోలికి రారు."

విజయరామరాజు ఏమీ మాట్లాడలేదు.

బ్రిటిష్ కంపెనీకి చెందిన సైన్యం సహకారాన్ని తీసుకుని సామంతరాజుల తిరుగుబాట్లను అణిచివేసిన దివాన్ వైఖరి ఎందుకు ఇలా మారిందన్న విషయం అర్ధంకాలేదు. కంపెనీకి చెందిన భూములను కూడా కౌలుకు తీసుకున్న వ్యక్తిలో ఎందుకింత మార్పు వచ్చిందో తెలియడంలేదు. ఈ విషయంపై రాజాస్థానంలో తీవ్రమైన చర్చ జరిగింది.

దివాన్ సీతారామరాజు వైఖరి రాజ బంధువుల్లో విస్మయం కలిగించింది. విజయనగరం సంస్థానాధీశుడు విజయరామరాజు సంక్షేమాన్ని కోరుకునే ఈ విధమైన ఆలోచనలు చేస్తున్నాడా.. లేదా బ్రిటిష్ వారి ఆగ్రహానికి గురిచేసి రాజుని పదవీ భ్రష్టుడిగా చేయాలని ఆలోచిస్తున్నాడా అనుకున్నారు. అప్పటికే సీతారామరాజు పట్ల అతని వైఖరి పట్ల తీవ్ర వ్యతిరేకత ఉన్న రాజబంధువులు అతని మాట వినవద్దని విజయరామరాజుపై వత్తిడి తీసుకుని వచ్చారు.

విజయరామరాజు పరిస్థితి సందిగ్ధావస్థలో పడింది.

ఏమీ చేయాలో అర్థంకాలేదు. దివాన్‌గా కీలకమైన పదవిలో ఉన్న అన్నగారి మాటలు వినాలా.. బ్రిటిష్ వారిపై కాలుదువ్వాలో తెలియలేదు.

ఆ పరిస్థితిలో బ్రిటిష్ కంపెనీ అధికారులు విజయరామరాజుతో సంప్రదింపులు జరిపారు. "దుబాసీగా ఉన్న గొడే జగ్గారావుని మద్రాసు పంపించడానికి అనుమతి ఇవ్వాలని. విజయనగరం కోటలో బంధీలుగా ఉన్న జంపన జగన్నాథరాజుని విడిపించాలని" కోరారు. చాలా తర్జన భర్జనల తర్వాత ఈ రెండు పనులను విజయనగరం సంస్థానాధీశుని హోదాలో విజయరామరాజు పూర్తిచేసాడు.

ఈ చర్య దివాన్ సీతారామరాజులో తీవ్రమైన అసంతృప్తిని కలిగించింది.

తన మాట తమ్ముడు వింటాడని నమ్మి బ్రిటిష్ అధికారుల ఆగ్రహానికి గురయ్యానని బాధపడ్డాడు. దివాన్‌గా తాను ఉన్నప్పటికీ తమ్ముడి కోసం అహర్నిసలు కృషిచేస్తున్నా తనని నమ్మలేదని ఇకపై ఎటువంటి సహకారాన్ని కూడా అందించరాదని అనుకున్నాడు.

విజయరామరాజు కూడా మరో కోణంలో ఇదే విధంగా ఆలోచిస్తున్నాడు. బ్రిటిష్ కంపెనీ అధికారుల మాటలు విని అన్నగారు తీసుకున్న రెండు నిర్ణయాలను తాను ఉల్లంఘించాడు. అందువల్ల అతని ఆగ్రహానికి గురయ్యే ప్రమాదం ఉందని భావించాడు. దివాన్‌గా కీలకంగా వ్యవహరిస్తున్న అన్నగారి అండదండలు లేకపోతే బ్రిటిష్‌వారితో నెగ్గుకు రావడం చాలా కష్టమని అనుకున్నాడు. తర్వాత కాలంలో తన వైఖరి చాలావరకు సడలించాడు.

అన్నదమ్ముల మధ్య ఏర్పడిన విబేధాలు ఇద్దరూ వేరువేరుగా బ్రిటిష్ కంపెనీపై ఆధారపడేలా చేసింది. వారి అనుగ్రహం సంపాదించడానికి ఇద్దరు తాపత్రయపడేలా చేసింది. ఈ చర్య రానున్న కాలంలో బ్రిటిష్ కంపెనీకి ఎంతో లాభదాయకంగా మారింది.

విజయనగరం సంస్థానంలో అన్నదమ్ములు ఇద్దరూ ఒకసారి కలిసి ఉంటారు మరోసారి విడిపోతుంటారు. వీరు ఇద్దరూ కంపెనీ ప్రాబల్యాన్ని తగ్గించడానికి ప్రయత్నాలు చేయవచ్చునని అలా జరిగితే ఉత్తరాంధ్రలో కంపెనీ వ్యాపారానికి ఇబ్బంది వస్తుందని ఆదాయం కూడా గండి పడుతుందని భావించారు.

కంపెనీ ప్రతిష్ట పెరగాలంటే తక్షణం విజయనగరం కోటను వదిలి మద్రాసు రావాలని చిన విజయరామరాజుకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేసారు. దీనిని చూసిన విజయరామరాజు తాను కంపెనీకి వ్యతిరేకంగా ఏమీ చేయలేదని 1777 ఆగస్టు 17న విజయనగరం కోటను వదిలి విశాఖపట్నం వెళ్ళిపోయాడు.

ఇది విజయనగరంలో ఎవరూ ఊహించని విషయం. పరిస్థితి సర్దుబాటు అవుతుందని అందరూ భావించారు.

***ఇబ్బందికరంగా రంబోల్డు వ్యవహారశైలి.***

ఆనాడు మద్రాసు కేంద్రంగా బ్రిటిష్ కంపెనీ వ్యవహారాలు నడిచేవి. మద్రాసుకు 1778లో గవర్నరుగా నియమితులైె రండోల్డు వ్యవహారశైలితో చిన విజయరామరాజు విజయనగర సంస్థానాధీశులు చాలా ఇబ్బంది పడ్డారు. తన పరిధిలో ఉన్న సంస్థానాల వ్యవహారాలను మద్రాసులో తన సమక్షంలోనే పరిష్కరించాలని 31మంది సంస్థానాధీశులకు ఈనాందార్లకు ఆయన బాధ్యతలు తీసుకున్న వెంటనే తాఖీదులు పంపారు.

ఈ విషయాలను వివరిస్తూ ఆయన 1778 ఏప్రిల్ 4న చిన విజయరామరాజుకు లేఖను రాసి అందులో కంపెనీ ఎటువంటి ఉత్తర్వులను జారీ చేసినా వాటిని తక్షణం అమలు జరపాలని ఆదేశించాడు. తననుంచి ఎటువంటి ఆదేశాలు వచ్చినా వాటిని ఎటువంటి అభ్యంతరాలు లేకుండా అమలు చేయాలని కూడా కోరాడు.

ఈ విషయం విజయరామరాజుకు కోపం తెప్పించింది.

తాను మద్రాసు రాలేనని రంబోల్డుకు జవాబు రాసాడు. అందులో తాను కంపెనీ ఆధిపత్యాన్ని దిక్కరించడం లేదని అవసరమనుకుంటే విశాఖపట్నం వెళ్ళి అక్కడ ముఖ్యమైనవారిని కలిసి తాను చెల్లించవలసిన పేష్కను సొమ్ము గురించి చర్చించడానికి ఎటువంటి అభ్యంతరం లేదని పేర్కొన్నాడు.

ఈ లేఖ రంబోల్డును మరింత రెచ్చగొట్టింది.

మద్రాసులో ఉన్న తనను కలవడానికి ఇష్టపడని వ్యక్తి తనకింద విశాఖపట్నంలో పనిచేస్తున్నవారికి కలవడానికి అభ్యంతరం లేదని చెప్పడం అతడికి అవమానంగా భావించాడు. వెంటనే రంబోల్డు మరో లేఖరాస్తూ విజయరామరాజు తన వైఖరిని మార్చుకోకపోతే అత్యంత బాధాకరమైన నిర్ణయాలను తీసుకోవలసి ఉంటుందని ఒకసారి ఎటువంటి ఉత్తర్వులు జారీ అయినా వాటిని వెనక్కి తీసుకునే ప్రసక్తే లేదని హెచ్చరించాడు.

విజయరామరాజు ఈ లేఖకు కూడా మళ్ళీ జవాబు రాసి రంబోల్డు ఆగ్రహానికి గురయ్యాడు. ఈ లేఖలో "బ్రిటిష్ కంపెనీ నా మనస్సాక్షికి వ్యతిరేకంగా పనిచేయమని వత్తిడి తీసుకుని వస్తోంది. అందువల్ల మా అధికారాలన్నీ అంతమయ్యాయని భావిస్తున్నాను. దీని ఫలితంగా రాజ్యాన్ని కోల్పోయే పరిస్థితి కూడా వచ్చే అవకాశం ఉందని అనుకుంటున్నాను" రాసాడు.

రబోల్డుకు విజయరామరాజుల మధ్య జరిగిన ఉత్తరాల యుద్ధం సీతారామరాజు మరోలా ఉపయోగించుకున్నాడు మద్రాసు వెళ్ళి రంబోల్డును కలుసుకుని ప్రసన్నం చేసుకున్నాడు. దీని ఫలితంగా రంబోల్డు కొత్త ఉత్తర్వులు జారీ చేసారు. అందులో విజయనగరం సంస్థానంలో దివాన్‌ను నియమించే అధికారం ఆనాటి నుంచి మద్రాసు కంపెనీకి సంక్రమించిందని ప్రకటించాడు. దాని ఫలితంగా సీతారామరాజును విజయనగరం సంస్థానానికి దివాన్‌గా నియమించాడు.

రంబోల్డు ఉత్తర్వులను అమలు చేయడానికి చిన విజయరామరాజు ఇష్టపడలేదు. తాను తొలిగించిన తన అన్నగారిని తిరిగి దివాన్‌గా నియమించడం అతని మనసుకు నచ్చలేదు. లండన్‌లో బ్రిటిష్ అధికారులకు ఈ విషయాలను తెలియజేసాడు అక్కడి నుంచి సానుకూలంగా స్పందన కనిపించలేదు. తన అన్నగారితో రాజీపడటం తప్ప మరో మార్గం లేదని భావించి 1778 అక్టోబరు 29న లేఖ రాస్తూ గత కొంతకాలంగా తనకు తన సోదరుడికి మధ్యకొన్ని విబేధాలు కొనసాగినప్పటికీ ఇప్పటికి రాజీపడ్డామని భవిష్యత్తులో కూడా కలిసి ఉంటామని పేర్కొన్నాడు.

ఈ లేఖ అనంతరం రాజ్యంలో పరిస్థితులు కొంతవరకు సర్దుబాటు అయ్యాయి.

రాజ్యాధిపతిగా ఉన్నప్పటికీ విజయనగరం కోటకు దూరంగా ఉండటం విజయరామరాజుకు కాస్త ఇబ్బందిగా అనిపించేది. ఒక పరిస్థితిలో అన్నగారు సీతారామరాజుకు అప్పగించి తాను శ్రీరంగం, తిరుపతి వంటి పుణ్యక్షేత్రాలకు తరలిపోవాలని భావించాడు.

ఆ సమయంలో విజయగరం కోట 1779 జనవరిలో బ్రిటిష్‌వారు విజయరామరాజుకు దాఖలు పరిచారు. తిరిగి కోటను స్వాధీనం చేసుకోవడంతో రాజు పరిస్థితిలో మార్పు వచ్చింది. తన మనస్సును మార్చుకున్నాడు.

***కొత్త సభ్యులతో సర్క్యూట్ కమిటి***

ఉత్తర సర్కారులో ఆర్థిక పరిస్థితులను అధ్యయనం చేయడానికి గతంలో ఏర్పాటు చేసిన సర్క్యూట్ కమిటీని పునర్వవస్థీకరించమని లండన్‌లో కంపెనీ డైరెక్టరు 1781 జనవరి 10న ఆదేశాలు కారీ చేసినప్పటికీ రెండు సంవత్సరాలు ఆలస్యంగా 1783 ఏప్రిల్‌లో ఈ కమిటీ ఏర్పాటైంది. ఇందులో ఓ రామ్, హ్యూమేక్స్‌వేల్, ఎడ్వర్డు ప్రౌడ్, విలియం, మోర్గన్ విలియమ్స్, ఎడ్వర్డు సాండర్సులను సభ్యులుగా నియమించారు. వీరు 1783 అక్టోబరు 4న తన పనులను ప్రారంభించారు.

ఈ కమిటీ వివిధ ప్రాంతాలను పర్యటించింది.

కశింకోట డివిజన్‌లో, కురుపాం, మాడుగుల బొబ్బిలి, కొత్తపాలె, అనకాపల్లి, పార్వతీపురం ఆనాడు విజయనగరం సంస్థానంలో ఉన్నాయి. జయపూర్ వద్ద నందాపురం, గొలుగొండ ఆంధ్ర, పాలకొండ తదితర చిన్న సంస్థానాలు సామంతరాజ్యాలుగా ఉన్నాయి. ఎంతో బలీయమైన సంస్థానంగా ఉన్న విజయనగరం బలాన్ని తగ్గించాలని ఈ కమిటీ సభ్యులు ఈ పర్యటనలో అనుకున్నారు.

దీని ఆధారంగా ఈ కమిటీ కొత్త సిఫార్సును విజయనగరం సంస్థానం ముందుంచింది. సంస్థానాధిపతి తన సైన్యాన్ని రెండువేలకు పైబడి ఉంచుకోకూడదు. అందువల్ల సైనిక వ్యయం రూ4.05,601 తగ్గుతుంది. ఈ సొమ్ముని ఈస్టు ఇండియా కంపెనీకి చెల్లించాలి. ఒరిస్సాలో ఉన్న నందాపురం సంస్థానాన్ని విజయనగరం నుంచి వేరుచేయాలి అని సిఫార్సులు చేసింది. విజయనగరం సంస్థానం వారు రానున్న అయిదు సంవత్సరాల వరకు చెల్లిస్తున్న రూ.3.29 లక్షలకు అదనంగా మరో లక్షరూపాయలు చెల్లించాలి. అనకాపల్లి, సత్యవరం సంస్థానాలు ద్వారా ఆదాయం వస్తున్నందున అదనంగా మరో 90వేలు చెల్లించాలి. అనకాపల్లిలో ఉన్న రాణులకు పదివేలు భరణాన్ని చెల్లించాలి అని కూడా సిఫార్సులు చేసారు.

ఈ విషయాలు విజయరామరాజుకు మింగుడు పడలేదు.

తన దగ్గరున్న సిబ్బందిని కొంతమేర తగ్గించుకోవడానికి అంగీకరించాలని అనుకున్నా అదనంగా చెల్లించవలసిన పేష్కను మాత్రం చెల్లించలేనని అతనికి అర్థం అయింది. తాను సంస్థానం వ్యవహారాలను ఆర్థిక ఒడిదుడుకుల మధ్య నిర్వహించలేనని తెలిసిపోయింది. ఈ పరిస్థితుల్లో సంస్థానాన్ని తమకు స్వాధీనం చేస్తే మంచిదని బ్రిటిష్ వారి నుంచి పరోక్షంగా సూచనలు అందాయి.

కానీ విజయరామరాజు వీటికి అంగీకరించలేదు.

ఈ పరిస్థితుల్లో సర్క్యూట్ కమిటీ చేసిన సిఫార్సుల ఆధారంగా చేసుకుని మద్రాసులో ఉన్న అధికారులు విజయరామరాజు బ్రిటిష్ వారికి అప్పటివరకు చెల్లిస్తున్న 5లక్షల రూపాయల పేష్కనుకు మరో నాలుగు లక్షలు కలిపి మొత్తం తొమ్మిది లక్షలు చెల్లించవచ్చునని కూడా సూచించారు ఈ విధంగా చేస్తే విజయరాజు బ్రిటిష్ వారిపై తిరుగుబాటు చేయలేదని ఆర్థిక సమస్యలతో ఎప్పటికప్పుడు తమపై ఆధారపడతాడని వారి ఆలోచనగా ఈ చర్య తీసుకున్నారు.

ఈ సిఫార్సులను అమలు చేయడానికి విజయరామరాజు అంగీకరించలేదు.

ఆ సమయంలో విశాఖపట్నంలో బ్రిటిష్ కంపెనీ ప్రతినిధిగా ఉన్న క్లాడ్‌రస్సెల్ అదనపు పేష్కను చెల్లించడానికి విజయరామరాజు ఇష్టపడటం లేదని సైన్యాన్ని కూడా తగ్గించే ప్రయత్నాలు చేయడం లేదని అనేక ఫిర్యాదులు పంపాడు.

ఈ పరిస్థితుల్లో విజయరామరాజు స్వయంగా విశాఖపట్నం వెళ్ళి ఛీఫ్‌ని కలుసుకున్నాడు. తనకు కంపెనీ నుంచి రావల్సిన ఎగుమతి దిగుమతి సుంకాలను సరుకుల రవాణా పన్నుని మినహాయించుకుని మిగిలిన మొత్తాన్ని 1794 ఫిబ్రవరిలోపు చెల్లించగలనని చెప్పాడు దీనికి చీఫ్ అంగీకరించలేదు. ఆ తర్వాత నిరాశతో తిరిగి వచ్చిన విజయరామరాజు తన వద్ద పనిచేస్తున్న వెంకటపతిరాజుని మళ్ళీ చీఫ్ వద్దకు పంపించి రెండు కిస్తీల తాలూకు 4.50 లక్షలు పాతబకాయిలు లక్షరూపాయలు కలిపి ఒక నెలరోజుల లోపు చెల్లించగలనని వర్తమానం పంపాడు.

దీనికి విశాఖపట్నంలో ఉన్న అధికారులు సుముఖత చూపించారు.

మద్రాసు అధికారులు ఈ సూచనని అంగీరించలేదు. వెంటనే సంస్థానాన్ని స్వాధీనం చేసుకోవాలని అనకాపల్లి భూములను కౌలుకు తీసుకుని సాగు హక్కులో ఉన్న దివాన్ సీతారామరాజును కూడా కౌలుదారు పదవి నుంచి తొలగించాలని ఆదేశాలు జారీ చేసింది.

తప్పనిసరి పరిస్థితుల్లో విజయరామరాజు తాత్కాలికంగా తన మకాంను సింహాచలానికి మార్చుకున్నాడు.




ఈ యుద్ధ క్షేత్రంలో పర్యాటక శాఖ ఏర్పాటు చేసిన బోర్డు. ఈ యుద్ధం ఎంతో ప్రాధాన్యత కలిగినదని ఇందులో వివరించారు ఈ బోర్డు కూడా ఈసమాధి ప్రాంతంలోనే ఉంది

కొద్దిరోజులు ఉన్న తర్వాత తాను విజయనగరం సంస్థానం నుంచి దూరమైపోవడం కోట వేరొకరి ఆధీనంలో ఉండటం ఏదోలా అనిపించింది. తాను సింహాచలంలో ఉండటం కన్నా విశాఖపట్నంలో మకాం ఉంటే బాగుంటుందని విజయరామరాజు భావించాడు. అప్పటికే దివాన్‌గా ఉన్న సీతారామరాజు తాను కౌలుకు తీసుకున్న అనకాపల్లి భూములను ఈస్టు ఇండియా కంపెనీ వారికి అప్పగించి మద్రాసుకు వెళ్ళిపోయాడు. అటువంటప్పుడు తాను విశాఖపట్నంలో నివాసం ఉండటమే మంచిదని, అందుకు అవకాశం కలిపించాలని కంపెనీ అధికారులను కోరాడు.

దీనిపై మద్రాసు రెవిన్యూ బోర్డు సమావేశం జరిపి విజయనగరం సంస్థానాధీశునిగా అంతవరకు వ్యవహరించిన విజయరామరాజు విశాఖపట్నంలో నివశించడానికి అవకాశం కల్పిస్తూ నిర్ణయాన్ని తీసుకుంది ఆయన ఖర్చులకుగాను నెలకు పన్నెండువేల రూపాయలు భరణంగా ఇవ్వడానికి అదేవిధంగా అప్పటికే మద్రాసు తరలిపోయిన దివాన్ సీతారామరాజుకు నెలకు అయిదువేల రూపాయల చొప్పున భరణంగా ఇవ్వాలని నిర్ణయించడం జరిగింది.

విజయరామరాజు ఎందుకు ఈ విధంగా ఆలోచన చేస్తున్నారో ఆయనకు అత్యంత సన్నిహితులు అనుయాయులుగా ఉన్న ఇతర రాజులకు కానీ మింగుపడలేదు. ఆయన అంతర్యం ఏమైవుంటుందో కూడా వారికి అర్థంకాలేదు.

***(కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments